క్లుప్తంగా

సదరం సర్టిఫికెట్లు పంపిణీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 50 మంది దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, మెప్మా పీడీ సుభాష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కడెంకు తగ్గిన వరద

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 (7.603టీఎంసీ) అడుగులు కాగా, బుధవారం ప్రాజెక్ట్ నీటిమట్టం 695.675 (6.520టీఎంసీ) అడుగులుగా ఉంది.

అందుబాటులో యూరియా

ఖానాపూర్: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో భూమి ఆశన్న తెలిపారు. కావాల్సిన వారు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లను పీఏసీఎస్ కార్యాలయానికి తీసుకురావాలని సూచించారు.

కార్యదర్శిగా 'లక్కాకుల' నియామకం



నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నిర్మల్ పట్టణానికి చెందిన లక్కాకుల తుకారాం పటేల్ నియామకమయ్యారు. ఈమేరకు మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవికుమార్ పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు తుకారం కృతజ్ఞతలు తెలిపారు.

మిత్రుడికి ఆర్థికసాయం



సురేశ్‌కు సాయం అందిస్తున్న మిత్రులు

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన గరిపెల్లి సురేశ్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఈవిషయం తెలిసి ఇజ్రాయిల్ దేశంలో ఉంటున్న లక్ష్మణచాందకు చెందిన అతడి మిత్రులు ఫొటోస్టూడియో రాజేశ్వర్, తిప్పరపు సృజన్ అక్కడ తమ రూమ్‌లో ఉన్న మిత్రుల సాయంతో రూ.15వేలను జమ చేశారు. ఇటీవల ఇజ్రాయిల్ నుంచి ఇండియాకు వచ్చిన బిక్కునూర్ రాజు సైతం రూ.5వేలను సమకూర్చారు. బుధవారం మొత్తం రూ.20వేలను సురేశ్‌కు అందించారు. కార్యక్రమంలో ఈటెల శ్రీనివాస్, కొట్టూరి సృజన్, సిరాజుద్దీన్, ఆడెపు పోశెట్టి పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, జ్యోతిబాపూలే పాఠశాల(బాలురు), కళాశాల ల్లో విద్యార్థులకు ఎయిడ్స్, టీబీ వ్యాధులపై బుధవారం ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ అవగాహన కల్పించారు. విద్యార్థులు దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్టీఎస్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్, సిబ్బంది అనిల్, లలిత, చలం తదితరులు ఉన్నారు.

'నిందితుడిని శిక్షించాలి'

నిర్మల్‌ఖిల్లా: ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలో ఓ మహిళపై దాడి, అత్యాచారయత్నం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని టీపీజేఏసీ జిల్లా చైర్మన్ ఆరేపల్లి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన శిక్షలు విధించాలని కోరారు.

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

నిర్మల్: సర్కారుబడిని నమ్ముకుని వచ్చే పేద పిల్లలకు సరైన చదువులు చెప్పకుండా అక్రమ వ్యాపారాలు చేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని, సంబంధిత విద్యాశాఖాధికారులనూ విచారించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సాయంత్రం నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందించారు. ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ యూబిట్ పేరిట అక్రమ వ్యాపారం చేస్తూ, యథేచ్ఛగా విదేశీ యాత్రలకు వెళ్తున్న ఉపాధ్యాయుల విషయంలో విద్యాశాఖ సరైన చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. ఈవిషయంలో సంబంధిత అధికారులనూ విచారించాలని కోరారు. పట్టణ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

సోన్: రేషన్‌కార్డు లేక రుణం మాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏవో వినోద్‌కుమార్ తెలిపారు. మండలంలోని న్యూవెల్మల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు ఫారంపై ప్రభుత్వ ఉద్యోగి సంతకం తప్పని సరి అని తెలిపారు. ఏఈవోలు జాదవ్ ఉమ, ప్రగతి, కార్యదర్శి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

- కుభీర్‌లో ప్రశాంతంగా బంద్
- ధర్నా చేసిన విఠలేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు



బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు



మూసివేసిన దుకాణాలు



వరదకు కారణమైన మురుగుకాల్వ పరిశీలిస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి, అధికారులు, నాయకులు

కుభీర్: మండల కేంద్రంలో ప్రధాన మురుగుకాల్వపై కొందరు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న షెడ్లను తొలగించాలని పలువురు గ్రామస్తులు, విఠలేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు బుధవారం కుభీర్ బంద్‌కు పిలుపునిచ్చి బస్టాండ్ వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా అక్కడే వంటావార్పు నిర్వహించి సామూహికంగా భోజనాలు చేశారు. పీహెచ్‌సీ నుంచి విఠలేశ్వరస్వామి ఆలయానికి వరద రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. తహసీల్దార్ ఎం.సోము వచ్చి అక్రమంగా షెడ్లు నిర్మించుకున్నవారు 2018లో హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని.. సదరు కేసు ఈనెల 11న విచారణ రానుందని పేర్కొన్నారు. అప్పుడు అక్రమ షెడ్లను తొలగిస్తామని వివరించారు. మైసమ్మ చెరువు కట్టను ఓ రైతు దున్నేయడంతో ఆ నీరు సైతం ఆసుపత్రిలోకి, విఠలేశ్వర మందిరంలోకి వస్తుందని తహసీల్దార్‌కు వివరించారు.

అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డి వచ్చి మురుగుకాల్వపై ఏర్పాటు చేసుకున్న అక్రమ షెడ్లను పరిశీలించారు. ఐదు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు పేర్కొన్నారు. సీఐ నైలు, ఎస్సై పి.రవీందర్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటాజీ, మాజీ మండల అధ్యక్షుడు బోయిడి విఠల్, బీజేపీ నాయకుడు పి.గంగాధర్, సావ.పండరి, నాగలింగం, గజ్జారాం, కనకాగౌడ్, లింబాంద్రి తదితరులు ఉన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



సోన్‌లో మాట్లాడుతున్న సీఐ నవీన్‌కుమార్



కడెంలో మాట్లాడుతున్న సీఐ సైదారావు

సోన్: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సోన్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో సీఐ మాట్లాడారు. గణేశుడి ప్రతిమలను ఏర్పాటు చేసే మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని పేర్కొన్నారు. తహసీల్దార్ మల్లేశ్, ఎస్సై గోపి, ఏఈ శ్రీనివాస్, ఆయా గ్రామాల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వినాయకచవితి ఉత్సవాలను జరుపుకొందామని సీఐ మల్లేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పశుపతినాథ్ ఆలయ కల్యాణ మండపంలో మత, కులపెద్దలతో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై సాయికిరణ్, తదితరులున్నారు.

కడెం: మండపాల నిర్వాహకులు అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. కడెం రైతువేదికలో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. తహసీల్దార్ సుజాత, ఏఈఈ సుమన్, ఎంపీవో కవిరాజు ఉన్నారు.

లక్ష్మణచాంద: గణేశుడి మండపాల నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై సుమలత ఒక ప్రకటనలో తెలిపారు.

మామడ: మండపాల నిర్వాహకులు వివరాలు అందిస్తే నిమజ్జనం వేళ బందోబస్తు ఏర్పాటుకు సులభంగా ఉంటుందని ఎస్సై సందీప్ అన్నారు. మండలంలోని పొన్కల్‌లో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. వీడీసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

బాసర: గణేశుడి ప్రతిమలను ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై గణేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. డీజేలకు అనుమతి లేదని.. ప్రతిమ ఏర్పాటు చేసే ఇంటి యజమాని నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందాలన్నారు.

నర్సాపూర్(జి): నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలని నిర్మల్‌రూరల్ సీఐ రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ ఆవరణలో మండపాల నిర్వాహకులతో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. ఎస్సై హన్మాండ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భైంసారూరల్: గణేశుడి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. మండలంలోని వానల్‌పాడ్‌లో మండపాల నిర్వాహకులు, గ్రామస్తుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సై శ్రీనివాస్‌యాదవ్, నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వానల్‌పాడ్‌లో సాయం చేస్తున్న ఉపాధ్యాయులు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన కదం భోజారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పరామర్శించారు. వారి వెంట మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సొలంకి భీంరావు తదితరులు ఉన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు భోజారాం కుటుంబీకులకు రూ.10వేలను ఆర్థికసాయంగా అందించారు. ఉపాధ్యాయులు గంగాధర్, గణపతి, శేఖర్‌వర్మ, జలపతిరెడ్డి, అమిత్‌నాయక్, రమేశ్, శ్రీనివాస్, మాలతి, కృష్ణమాచారి, భాస్కర్‌రాజు తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సుధాకర్ మృతి చెందగా.. బాధిత కుటుంబీకులను బుధవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రావుపటేల్, హైమద్‌ఖాన్, రమేశ్, రామేశ్వర్, సంతోశ్, శ్రీనివాస్, భోజన్న తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని అంబకంటికి చెందిన రాజేశ్వర్‌రావు, అందాకూర్‌కు చెందిన అమీనాబీ మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్ పరామర్శించారు. కల్లూరుకు చెందిన గంగారాం, గంగన్న మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, భోజారాం పటేల్, ఆనంద్‌రావు పటేల్, ప్రశాంత్ ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని గ్రామాల్లో బాధిత కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరామర్శించారు. జామ్‌కు చెందిన కండెల భోజన్న అనారోగ్యం బారిన పడగా ఆయనను పరామర్శించారు. మరణించిన బ్యాగరి నాగన్న కుటుంబాన్ని పరామర్శించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అతిక్ అహ్మద్, పోతారెడ్డి, హాదీ, రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

జోరు వానతో ఇబ్బందులు



ధర్మోరలో నీట మునిగిన వరి పొలాలు



జోహర్‌పూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సుదర్శన్



తానూరు: కూలిన గోడ చూపుతున్న బాధితుడు

లోకేశ్వరం: మండలవ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో వ్యవసాయ పనులు సాగలేదు. రైతులు, కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. పంచగుడి సమీపంలోని వంతెన వద్ద గోదావరి నిండుగా పారుతోంది. లోకేశ్వరం భగీరథ చెరువు, ధర్మోరలో పెద్దచెరువు పూర్తిగా నిండిపోయి అలుగు పారుతున్నాయి. వరద పొలాల్లోంచి పారడంతో పెద్ద గండ్లు ఏర్పడ్డాయని రైతులు తెలిపారు. జోహర్‌పూర్‌లో కామిడి లక్ష్మికి చెందిన ఇల్లు, పుస్పూర్‌లో జ్యోతి ఇల్లు కూలిపోగా డీఎల్‌పీవో సుదర్శన్, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఆర్ఐ బాలకిషన్ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

వర్షానికి కూలిన ఇంటిగోడ

తానూరు: మండలంలోని తొండాల గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బోగుల్వార్ రవికి చెందిన ఇంటిగోడ కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం తమకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

సంక్షిప్త వార్తలు

మాంసం దుకాణాలు మూసివేయాలి

బాసర: గణపతి, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మండల కేంద్రంలో మాంసం దుకాణాలను పూర్తిగా మూసివేయాలని వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం పంచాయతీ ఈవో గోవిందరాజుకు వినతిపత్రం అందించారు.

నేడు ఎన్నిక

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో ఈనెల 5న నిర్మల్ గణేశ్ ఉత్సవ సమితి ఎన్నికను నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి గణేశుడి మండపాల అధ్యక్ష, కార్యదర్శులు, హిందూ ధార్మిక సంస్థలు, ప్రజాప్రతినిధులు హాజరవాలని కోరారు.

సకాలంలో నిమజ్జనం పూర్తి చేయాలి

లక్ష్మణచాంద: సకాలంలో వినాయక నిమజ్జనం పూర్తి చేయాలని మండలంలోని వడ్యాల్ వీడీసీ సభ్యులు తీర్మానం చేశారు. బుధవారం గ్రామంలో వీడీసీ సభ్యులు, వినాయ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న యూత్ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. నిమజ్జనం ఆలస్యమైతే చర్యలు తీసుకుంటామని సభ్యులు పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కుంటాల: రోగాల బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా బుధవారం మండలంలోని లింబా(కె), పెంచికల్‌పాడ్ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సారిక, గంగాప్రసాద్, సీసీలు పెంటన్న, కవిత, యూసుఫ్, గ్రామ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మి, వీవోఏలు గౌతం, సంపత్, స్వయంసహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శుభ్రతపై దృష్టి సారించాలి..

తానూరు: వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో శుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. బుధవారం మండలంలోని బామ్నితండా, బామ్ని గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి భరత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

ఖానాపూర్: గ్రామాల్లో దోమల నివారణకు బయోలార్వా స్ప్రే చేయించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న చింతల్‌పేట గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పంచాయతీ సెక్రెటరీ సురేందర్ తదితరులు ఉన్నారు.

విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

కడెం: హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేశ్‌రెడ్డిని బుధవారం నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన జిల్లా రైతులకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

కులవృత్తులకు కేంద్రం చేయూత



మంజూరైన కిట్లను అందిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసాటౌన్: కుల వృత్తులకు చేయూతనిచ్చేందుకు కేంద్రప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తోందని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎస్ ఫ్యాక్టరీలో ఖాదీ ఇండియా పథకం కింద 33 మంది కుమ్మరి కులస్తులకు మంజూరైన పరికరాలను అందజేశారు. అలాగే ఖాదీ ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కుమ్మరి జాగృతి సొసైటీ నియోజకవర్గ అధ్యక్షుడు లింగన్న, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు రమేశ్, భీంరావు, సుష్మారెడ్డి, చంద్రకాంత్ పటేల్, తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

బాసర: మండల కేంద్రంలోని వ్యాసపురి బ్రాహ్మణ శివపార్వతి గణేశుడి మండలి ఆధ్వర్యంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే రామారావ్‌పటేల్‌కు భైంసాలోని వారి నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. శుక్రవారం జరిగే గణపతి ఆగమన వేడుకలకు ముఖ్య అతిథిగా రావాలని కోరారు. కార్యక్రమంలో వ్యాసపురి బ్రాహ్మణ సంక్షేమసంఘం అధ్యక్షుడు, పూజారి వెంకటేశ్, నవీన్‌శర్మ, మాజీ జెడ్పీటీసీ సావ్లి రమేశ్, మాజీ సర్పంచ్ సతీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దాతల అండ



బాబాపూర్‌లో సరుకులు అందిస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: వర్షాలతో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు పలువురు దాతలు ముందుకొస్తున్నారు. ఇటీవలి వర్షాలకు మండలంలోని బాబాపూర్ గ్రామంలో గుండాల లక్ష్మి అనే బాలింత ఇల్లు కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు బుధవారం బాబాపూర్ వెళ్లి లక్ష్మి కుటుంబానికి నెల రోజుల వరకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. సంస్థ మండల కోఆర్డినేటర్ కరణ్‌కుమార్, మాడ బోయిన రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని అందాకూర్‌లో పశువుల కాపరి సిరాథ్‌కు చెందిన ఇల్లు ఇటీవలి వర్షాలకు కూలిపోయింది. స్థానిక ఆర్‌ఎంపీ అశోక్ తన కుమారుడు అఖిల్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం బాధిత కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. పంచాయతీ కార్యదర్శి రమ్య, ముద్దం భోజన్న, నవీన్, దాసరి శంకర్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

నిర్మల్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా.. విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదని పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లలో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. ఇందులో ఇందూరు విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేశ్, లక్కీ, సన్నీ, గణేశ్, సాయి తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కైరి శశి, దుర్గాప్రసాద్, వంశీ, మున్నా, పరశురాం తదితరులు ఉన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



నర్సాపూర్(జి): దర్యాపూర్‌లో వేడుకలు



కుంటాల : ఓలాతండాలో బుట్టలతో బంజారాలు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలోని దర్యాపూర్ గ్రామంలో బుధవారం బంజారాలు తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువతులు గోధుమనారు బుట్టలు ఎత్తుకొని ఆడి పాడారు. మొక్కులు చెల్లించుకొని స్థానిక చెరువులో బుట్టలను నిమజ్జనం చేశారు. యువతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని ఓలా పంచాయతీ పరిధిలోని ఓలాతండాలో బుధవారం తీజ్ సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. మట్టి నింపిన బుట్టలో గోధుమ గింజలను చల్లి తొమ్మిది రోజుల పాటు నీటిని అందిస్తారు. తర్వాత మొలకెత్తిన గోధుమనారు బుట్టలను ఎత్తుకొని తమ సంప్రదాయం ప్రకారం ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ మాజీ సభ్యులు హైమద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ నీటమునిగిన వైకుంఠధామం



ఖానాపూర్‌లో నీటమునిగిన వైకుంఠధామం

ఖానాపూర్: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎస్సారెస్పీ 40 గేట్లు ఎత్తివేయడంతో గోదావరికి భారీగా వరదనీరు వస్తోంది. దీంతో ఖానాపూర్ పట్టణంలోని గోదావరి లోపలి వైపు ఉన్న వైకుంఠధామం మూడోసారి వరదనీటితో మునిగిపోయింది. ఖానాపూర్ మున్సిపాలిటీగా ఏర్పాటయ్యాక రూ.50 లక్షలకు పైగా వెచ్చించి వరద ప్రవహించే ప్రాంతంలో వైకుంఠధామం నిర్మించారు. దీంతో రెండుసార్లు వరదలకు తీవ్రంగా దెబ్బతింది. దుస్తులు మార్చుకునే గదుల రేకులు లేచిపోయి గోడలు కూలిపోయాయి. ఈసారి వరద ప్రవాహానికి వైకుంఠధామం పూర్తిగా మునిగింది. దీంతో నిధులు దుర్వినియోగం అయ్యాయని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముగిసిన ఇండక్షన్ ప్రోగ్రాం



ముగింపు కార్యక్రమంలో విద్యార్థులతో ఆర్జీయూకేటీ అధికారులు

బాసర: బాసర ఆర్జీయూకేటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో చేరుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రాం ముగిసింది. వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు 13 రోజుల పాటు నిర్వహించగా బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, అసోసియేట్ డీన్స్ డాక్టర్ చంద్రశేఖర్, శ్రీ మహేష్ పాల్గొని ప్రసంగించారు. 35 మంది ఉపన్యాసకులు వ్యక్తిత్వ వికాసం, పబ్లిక్ స్పీకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంజినీరింగ్ విద్యావిధానం, సృజనాత్మక కళలు, సైబర్ సెక్యూరిటీ, క్రీడారంగం, డెసిషన్ మేకింగ్, టైం మేనేజ్‌మెంట్, తదితర అంశాలపై మాట్లాడారు. ఆర్జీయూకేటీ విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఉపన్యాసకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త కిరణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశీలన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం రైతుల నుంచి స్వీకరించిన రుణమాఫీ దరఖాస్తులను నిర్మల్ ఏడీఏ భాస్కర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో వసంత్, ఏఈవోలు పవిత్ర, మౌనిక తదితరులు పాల్గొన్నారు.